# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-06-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మెగా డీఎస్సీ ద్వారా 16 వేల 347 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ సహా పలు కీలక నిర్ణయాలకు ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి ఆమోదం తెలిపింది.**
2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లాలోని కుప్పంలో ఈరోజు, రేపు పర్యటించనున్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో చేనేతకు పూర్వ వైభవం తీసుకొస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు.**
4. **తెలంగాణలో గత మే నెలలో జరిగిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి.**
5. **ప్రముఖ భాషా శాస్త్రవేత్త, సాహితీ విమర్శకులు వరుఖల చిన సీతారామ శాస్త్రి జయంతి ఈరోజు.**

==========================

మెగా డీఎస్సీ ద్వారా 16 వేల 347 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ సహా పలు కీలక నిర్ణయాలకు ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి ఆమోదం తెలిపిందని రాష్ట్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. నిన్న వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి సమావేశం జరిగింది. మంత్రిమండలి సమావేశంలో ఆమోదించిన అంశాలపై మంత్రి పార్థసారథి పాత్రికేయులకు వివరించారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం సందర్భంగా చేసిన 5 సంతకాలకు మంత్రిమండలి ఆమోదం తెలిపిందన్నారు. భూహక్కు చట్టం రద్దుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, అలాగే 3 వేల నుంచి 4 వేల రూపాయలకు పెంచిన పించను మొత్తాన్ని జులై 1 నుంచి సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తామని తెలిపారు. నాణ్యమైన భోజనం అందించేందుకు 183 అన్న క్యాంటీన్లను ఒకేసారి ప్రారంభిస్తామని చెప్పారు. విజ్ఞప్తుల మేరకు 'వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం" పేరును "ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం'గా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి పేర్కొన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లాలో తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో ఈ రోజు, రేపు పర్యటించనున్నారు. ఈ మేరకు అధికారులు ముఖ్యమంత్రి పర్యటన వివరాలను

విడుదల చేశారు.పర్యటనలో భాగంగా ఈరోజు హంద్రీ-నీవా కాలువను పరిశీలిస్తారు. అనంతరం ముఖ్యమంత్రి అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించి ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరిగే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొని, సాయంత్రం కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో చేనేతకు పూర్వ వైభవం తీసుకొస్తామని నేత కార్మికులను అభివృద్ధి బాటలో తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. నిన్న విజయవాడలోని ఆప్కో వస్త్ర దుకాణాన్ని తనిఖీ చేసి చేనేత ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో 84, ఇతర రాష్ట్రాల్లో 16 ఆప్కో దుకాణాలు ఉన్నాయని, చేనేత వ్యాపారాన్ని పెంచేందుకు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొంటూ...

..వాయిస్...30 సెకన్లు

---------------------------

తెలంగాణలో గత మే నెలలో జరిగిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. నిన్న హైదరాబాద్‌లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఫలితాలను విడుదల చేశారు. ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల్లో 43.77 శాతం మంది ఉత్తీర్ణత నమోదు అవ్వగా, ఒకేషనల్ విభాగంలో 51.12 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని అధికారులు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో పరీక్షల్లో 63.86 శాతం ఉత్తీర్ణత నమోదు అవ్వగా, ఒకేషనల్‌లో 53.24 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని అదిఆకారులు వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలో జ్యుడీషియల్, ఐఏఎస్ అధికారుల నివాస భవన నిర్మాణాల పూర్తికి ఇంజినీర్లతో అంచనా వేయించాలని అధికారులను ఆదేశించినట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నిన్న రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాజధానిలో అసంపూర్తిగా నిలిచిపోయిన భవన నిర్మాణాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు వెల్లడించారు. అంచనాలు పూర్తయ్యాక మరోసారి ముఖ్యమంత్రితో సమావేశమై పనులు ప్రారంభిస్తామని వివరించారు.

---------------------------

నీట్-యూజీ పరీక్ష పేపర్ లీక్ ఆరోపణలపై విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర విద్యా శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పేపర్ లీక్ విషయంలో ప్రమేయం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించింది. ఈ నేపథ్యంలో పరీక్ష సమగ్రత కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు... విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎటువంటి మానసిక స్థితి కలిగి ఉండాలన్న అంశాలపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక చర్చా కార్యక్రమం ఈ ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

తెలంగాణలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎంఎస్ఎంఈలకు సంబంధించి విధి విధానాలను రూపొందించి రాబోయే శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు

ప్రకటించారు. నిన్న హైదరాబాద్‌లో మంత్రి మాట్లాడుతూ, భారతదేశ ఆర్థిక ప్రగతిలో ఎంఎస్ఎంఈలు ముఖ్య భూమిక పోషిస్తాయన్నారు. ఎంఎస్ఎంఈల ప్రోత్సహకానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. నైపుణ్య విశ్వవిద్యాలయం, ఏఐసీటీ ఏర్పాటుకు 200 ఎకరాల స్థలం కేటాయించినట్లు వివరించారు. పరిశ్రమలూ కేవలం హైదరాబాద్‌కే పరిమతం కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోనూ ఏర్పాటుకు ఔత్సాహికులు ముందుకు రావాలని మంత్రి డి.శ్రీధర్‌బాబు కోరారు.

---------------------------

తెలంగాణలో ఈ వానాకాలం నుంచి ప్రారంభించనున్న రైతుభరోసా పథకంపై రైతుల అభిప్రాయాలను సేకరించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ శాఖ అధికారులను ఆదేశించారు. నిన్న హైదరాబాద్‌లో మంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో 110 నియోజకవర్గాల్లోని రైతువేదికల్లో దృశ్య మాధ్యమం ద్వారా సదస్సులు నిర్వహించాలని, ఆ నియోజకవర్గాల్లోని రైతులను రైతువేదికలకు ఆహ్వానించి వారి అభిప్రాయాలు తెలియజేసేలా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులకు మంత్రి సూచించారు. అనంతరం వాటిని నమోదు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని సూచించారు. అర్హులకు మాత్రమే ప్రజాధనం అందాలని ప్రభుత్వం భావిస్తోందని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం రైతుభరోసా విధివిధానాలను ఖరారు చేయనుందని మంత్రి తెలిపారు. రైతులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, సూచనలను మంత్రివర్గ ఉపసంఘానికి అందజేస్తామని మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, కె పవన్ కల్యాణ్ నిన్న విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో తెలుగు చలన చిత్ర నిర్మాతలతో సమావేశమయ్యారు. చిత్ర పరిశ్రమ సమస్యలు, రాష్ట్రంలో సినీరంగం విస్తరణకు ఉన్న అవకాశాలు, తదితర కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం చలన చిత్ర నిర్మాత అల్లు అరవింద్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో చిత్ర పరిశ్రమ అభివృద్ధి, స్టూడియోల ఏర్పాటు, చిత్రీకరణ ప్రదేశాల వంటి అంశాలపై విధానపరమైన నిర్ణయాలతో పాటు సినీ పరిశ్రమ సమస్యలపై త్వరలో ముఖ్యమంత్రితో చర్చించనున్నామని తెలిపారు.

---------------------------

విజయవాడ డివిజన్‌లో ఆధునికీకరణ పనుల కారణంగా రద్దు చేసిన రైళ్లలో కొన్నింటిని పునరుద్ధరించినట్లు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. జన్మభూమి, విజయవాడ-కాకినాడ పోర్ట్ రైళ్లను ప్రయాణికులకు మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చింది. విశాఖ- లింగంపల్లి మధ్య నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను ఈరోజు నుంచి యథావిధిగా నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. దీంతో పాటు విజయవాడ- కాకినాడ పోర్టు చెంగల్పట్టు- కాకినాడ పోర్ట్ మధ్య నడిచే రైళ్లను కూడా పునరుద్ధరించినట్లు పేర్కొంది. వీటితో పాటు రద్దీని తగ్గించేందుకు తీసుకొచ్చిన నర్సాపూర్ హైదరాబాద్, సికింద్రాబాద్ తిరుపతి, లింగంపల్లి కాకినాడ వంటి పలు ప్రత్యేక రైళ్లను జూలై 1 వరకు నడుపుతున్నట్లు వెల్లడించింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన భావాలను దేశ ప్రజలతో పంచుకునే మనసులో మాట మన్ కీ బాత్ కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి మన్ కీ బాత్ కార్యక్రమం ఇది. ప్రజలు తమ సలహాలు, సూచనలను ఈ నెల 28వ తేదీలోగా టోల్ ఫ్రీ నెంబర్ 1800-11-7800కు ఫోన్ చేసి గాని, నరేంద్ర మోదీ యాప్ లేదా మై గౌవ్ ఫోరమ్, ఇతర వేదికల ద్వారా తెలియజేయవచ్చు.

=====================